ప్రజాశక్తి

ఆదివారం 18 ఫిబ్రవరి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తూర్పులో రాజకీయ రగడ

◆ వైసిపి మాజీ, తాజా నాయకుల మధ్య వాగ్వాదం ◆ ఎంపీ ఎంవివి లక్ష్యంగా టిడిపి, జనసేన ఆరోపణలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో వైసిపి మాజీ, తాజా నేతల పాత కక్షలు భగ్గుమంటున్నాయి. విశాఖ వైసిపి ఎంపీ ఎంవివి సత్యనారాయణ, అదే పార్టీకి మొన్నటి వరకూ విశాఖ జిల్లా అధ్యక్షునిగా పనిచేసి, ఎంఎల్‌సి బాధ్యతల్లో ఉన్న వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మధ్య నెలకొన్న అంతర్గత యుద్ధం వ్యక్తిగత ఆరోపణలకు దారితీసింది. ప్రస్తుతం నగరంలో ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. ఒకే ఒరలో రెండు కత్తులు ఇమడవు అన్న సామెత మాదిరిగా రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న తగదా వారిరువురిది. తనను బహిరంగంగా అవమానపరిచారంటూ ఎంవిపి స్టేషన్‌లో తాజాగా వంశీపై ఎంవివి ఫిర్యాదు చేశారు. నెలల తరబడి వారి మధ్యగల అంతర్గత యుద్ధం తాజాగా మాటల



ఎంవివి.సత్యనారాయణ



వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్

తూటాలతో రగులుతోందనే చెప్పొచ్చు. 2019లో తనకు టికెట్ రాకుండా ఎంవివి అడ్డుకున్నారనే ప్రధాన ఆరోపణ వంశీ చేయడం తెలిసిందే. అంతేగాకుండా తన బంధువుల వద్ద చులకనగా ఎంవివి మాట్లాడారంటూ వంశీకృష్ణ టిడిపి నేత వెలగపూడితో కలిసి బాహాటంగా ఎంవివిపై మాటల దాడికి దిగడం సర్వత్రా చర్చనీయాంశమైంది. టిడిపి, జనసేన కలిసి తూర్పులో వైసిపిని ఓడిస్తాం అంటూ సవాళ్లు విసరడంతో ఎంవివి కూడా మీడియా ముందుకొచ్చి వంశీ, వెలగపూడిపై ప్రత్యారోపణలు చేశారు. సారా కొట్టుల్లో సొమ్ములు కొల్లగొట్టి అభివృద్ధి కావడం తనకు తెలీదన్నారు.

ఆర్థిక లావాదేవీలతో బంధం బలపడినా.. రాజకీయం బెడిసికొట్టిందా ?

సుమారు 2019 ఎన్నికల వరకూ ఎంవివి, వంశీ మధ్య స్నేహ సంబంధాలే ఉండేవని తెలుస్తోంది. వైసిపి రాజకీయాల్లోకి ఎంవివిని తేవడంలో వంశీ పాత్ర ఉందనే చర్చ నడుస్తోంది.. ఆర్థిక లావాదేవీలు బాగున్నా రాజకీయ 'సీట్ల'వ్యవహారం వీరి మధ్య వైరాన్ని పెంచిందా ? అంటే అవుననే అనిపిస్తోంది. తనకు మేయర్ పదవి దక్కుతుందని ఆశించిన వంశీ రాకపోడానికి ప్రధాన వ్యక్తుల్లో ఎంవివి ఉన్నారంటూ మిగతా 2లో..



వేపగుంట సభలో మాట్లాడుతున్న నారా లోకేష్, వేదికపై నాగజగదీష్, బండారు, పంచకర్ల

రాష్ట్రంలో అరాచక పాలన

◆ శంఖారావం సభల్లో నారా లోకేష్

◆ పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తామని హామీ

◆ తాడిని తరలిస్తామని ఉద్ఘాటన

ప్రజాశక్తి - భీమునిపట్నం, వేపగుంట

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనకు త్వరలో ప్రజలు చరమ గీతం పాడనున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. విశాఖ జిల్లాలోని వేపగుంట, తగరపువలస సమీపంలోని చిట్టివలస బంతాట మైదానం వద్ద శనివారం జరిగిన శంఖారావం సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచగ్రామాల భూ సమస్యను తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామన్నారు. తాడి గ్రామం తరలింపు, వేపగుంట రైతుల వుడా భూ సమస్య, సబ్బవరం-షీలానగర్ ఆరు లైన్ల రహదారి హామీలను నెరవేరుస్తామని చెప్పారు. ప్రజల్లో ఉండేవారే నిజమైన నాయకులని అన్నారు. హుదూద్ విలయానికి చివురుటాకులా వణికిన విశాఖను వారం రోజుల వ్యవధిలోనే సాధారణ స్థితికి తీసుకొచ్చిన మిగతా 2లో..

22న విశాఖలో ఐద్వా బహిరంగ సభ

▶ వార్త మెయిన్‌లో...

స్టీల్‌ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం

▶ వార్త మెయిన్‌లో..

మహిళల హక్కులను పరిరక్షించాలి

▶ వార్త 2లో..



ధర్నా శిబిరంలో అభివాదం చేస్తున్న నాయకులు

డిమాండ్లు నెరవేర్చకుంటే

ఉద్యమం ఉధృతం

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి హెచ్చరిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెలాఖరులోగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక జెఎసి చైర్మన్ కె.ఈశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జెఎసి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎన్‌జిఒ హోమ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్‌సి అమలు చేసి, డిఎ బకాయిలు చెల్లించాలన్నారు. పిఆర్‌సి ఇస్తామని చెప్పిన మంత్రుల హామీ నేటికీ నెరవేరలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగస్తుల సమస్యలను మిగతా 2లో..

మిలాన్ విన్యాసాలు షురూ..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 19 నుంచి 27 వరకు విశాఖపట్నంలో జరగనున్న మిలాన్ - 2024 విన్యాసాల రిహర్సల్స్ శనివారం సాయంత్రం బీచ్ రోడ్డులో ప్రారంభమయ్యాయి. ఆకాశంలో మిగ్‌లు దూసుకుపోయాయి. ప్యారాచూట్‌ల తో నావికులు చేసిన విన్యాసాలు ఔరా అనిపించాయి. హెలీకాప్టర్ల విన్యాసాలు ఒళ్లు గగుర్పాటుకు గురిచేశాయి. నేవీ బ్యాండ్ వినసొంపుగా సాగింది. బీచ్ రోడ్డులో నావికులు కవాతు రిహర్సల్స్ చేపట్టారు.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

మిలాన్-2024 సందర్భంగా ఈ నెల 17, 18, 19 తేదీలలో ప్రాక్టీస్ పరేడ్ రిహర్సల్స్ దృష్ట్యా బీచ్ రోడ్డు నందు పార్క్ హోటల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు పబ్లిక్ వాహనాల రాకపోకలను మధ్యాహ్నం 2 గంటల నుంచి మిగతా 2లో..



తీరంలో సాగుతున్న విన్యాసాలు

మొదటి పేజీ తరువాయి..

తూర్పులో రాజకీయ రగడ

విమర్శలు గుప్పించడం తెలిసిందే. తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్‌కు వైసిపి నుంచి దాదాపు ఎంవివి.సత్యనారాయణ పేరును అధిష్టానం ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఈ టికెట్‌ను ఆశించి భంగపడ్డ వారిలో ప్రధాన వ్యక్తిగా వంశీ ఉన్నారు. గతంలో ఓటమి చెందిన తనపై నియోజకవర్గంలో సానుభూతి ఉందని ఆయన పదేపదే చెప్పడం తెలిసిందే. ఇదిలా ఉండగా గత ఎన్నికల్లో అక్కరమాని విజయనిర్మల వైసిపి అభ్యర్థిగా తూర్పు నుంచి బరిలోకి దిగారు. రాష్ట్రమంతటా వైసిపి గాలి వీచినా విశాఖలో విరుద్ధంగా రాజకీయ పవనాలు వీచాయి. మధ్యతరగతి, ఉద్యోగులు అధికంగా ఉండే విశాఖ నగరంపై వైసిపి పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. వెలగపూడిపై అక్కరమాని గెలవలేకపోయారు.

తూర్పులో వైసిపి పాదయాత్రలతో టిడిపిలో కలవరం

తాజాగా ఈ టికెట్‌ను అన్నిరకాలుగా ఢీకొట్టగలిగే సత్తా ఉన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులను సరిపోల్చుకుని వెలగపూడిపై ఎంవివిని వైసిపి అధిష్టానం దించింది. ఎంవివికి అధిష్టానం టికెట్ గ్యారెంటీ చేసిన నుంచీ ఆరిలోవ, జాలారిపేట, ఎంవిపి కాలనీ వంటి టిడిపికి బలమైన ప్రాంతాల్లో పాదయాత్రలు, ప్రజలను కలుసుకోవడంలో ఆయన సఫలీకృతం కావడంతో టిడిపి కొంత ఇరకాటంలో పడింది. ఇదే సమయంలో వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ వైసిపిని వీడి జనసేనలో కలవడం తెలిసిందే. టిడిపితో పొత్తులో భాగంగా వెలగపూడి పక్కకు వంశీ చేరి ఎంవివిని టార్గెట్ చేశారని తెలుస్తోంది. వైసిపి అధిష్టానం, ఎంవివి ఈ రాజకీయ పరిణామాలను ఎలా ఎదుర్కొంటారన్నదే తూర్పులోనూ, ఇటు నగరంలోనూ రాజకీయ ప్రముఖుల్లో చర్చనీయాంశంగా మారింది.

ఉద్యమం ఉధృతం

పరిష్కరించాలని కోరారు. ధర్నాలో ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, ఎపిటిఎఫ్ నాయకులు కె.శ్రీనివాసు, యుటిఎఫ్ నాయకులు డి.నాగభూషణరావు, పెన్షనర్స్ సంఘం నాయకులు డి.ప్రసాదరావు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సత్తిబాబు, జ్యోతి, అధిక సంఖ్యలో ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి భీమునిపట్నం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఎపి ఎన్‌జిఒ సంఘం భీమిలి తాలూకా యూనిట్ ఆధ్వర్యాన జరిగిన ధర్నాను ఉద్దేశించి అసోసియేషన్ కన్వీనర్ కె.ముత్యాలరావు మాట్లాడుతూ 30 శాతం ఐఆర్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ భీమిలి తాలూకా యూనిట్ అధ్యక్షులు ఎం.లోవరాజు మాట్లాడుతూ, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కె.సాయిబాబా, పింఛనుదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.భీమారావు, ఎం.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

ఏకైక ప్రజా నాయకుడు చంద్రబాబు అని చెప్పుకొచ్చారు. విశాఖ అంటే ఆయనకు ఎంతో అభిమానమన్నారు. 2019లో విశాఖ ఓటర్లు టిడిపికి బ్రహ్మరథం పట్టారని, ఆ అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేమని అన్నారు. రెండు నెలల్లో రాష్ట్రంలో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడబోతుందని అన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా మరింతగా అభివృద్ధి చేస్తామని, మెడికల్ డివైజ్ మ్యానిఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తాము చెప్పిన ఆరు పథకాలను అమలు చేస్తామని ఉద్ఘాటించారు. ఆయా సభల్లో టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు ఎం.శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త కోరాడ రాజబాబు, మాజీ ఎమ్మెల్యే, జనసేన నాయకులు పంచకర్ల రమేష్ బాబు, పంచకర్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా పార్టీ బూత్, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జిలతో సమావేశమైన లోకేష్ 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ' ప్రచారం ఎలా జరిగిందన్న విషయంపై చర్చించారు. అనంతరం ఆరు పథకాల అమలుకు సంబంధించిన కిట్లు అందజేశారు. పద్మనాభం మాజీ ఎంపిపి కాళ్ల నగేష్ తదితరులు లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు.

మహిళల హక్కులను పరిరక్షించాలి

జిల్లా అధికారులకు సూచించిన మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి శ్రీదేవి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పని చేసే ప్రదేశాల్లో మహిళల హక్కులను పరిరక్షించాలని, సురక్షితమైన వాతావరణంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు విశాఖపట్నం మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి సూచించారు. మహిళల హక్కులకు ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించరాదని హితవు పలికారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం - 2013పై స్థానిక జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు భాగస్వాములయ్యారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ చట్టం తాలూకా ఉద్దేశాలను, మహిళలకు కల్పించిన రక్షణ చర్యలను వివరించారు. చట్టం గురించి అధికారులందరూ క్షుణ్ణంగా తెలుసుకోవాలని, పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.

ఆయా కార్యాలయాల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించి మహిళలపై వేధింపుల నిరోధక చట్టం గురించి విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. సదస్సులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వివేక ఆనంద శ్రీనివాస్, క్రైం డిసిపి పి.వెంకటరత్నం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.రాంబాబు, విశాఖపట్టణం జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, పలువురు మెజిస్ట్రేట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, న్యాయవాదులు, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిలాన్ విన్యాసాలు షురూ..

(మొదటి పేజీ తరువాయి..)

సాయంత్రం 6 గంటల వరకు బీచ్ రోడ్డువైపుగల రెండు లైన్లలో పాక్షికంగా నిలిపివేశారు. బీచ్ రోడ్డు నందు ఎటువంటి వాహనాలకూ పార్కింగ్ అనుమతి లేదని డిసిపి-1 మణికంఠ చందోలు తెలిపారు. శనివారం సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 20వ తేదీన జరిగే ఫుల్ డ్రెస్ రిహార్సల్స్, 22న జరిగే సిటీ పెరేడ్‌కు మరిన్ని ఆంక్షలు ఉంటాయని తెలిపారు. మిలాన్-2024కు పోలీస్ శాఖ 5000 మందితో భారీ భద్రత కల్పిస్తోందని వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనల నేపథ్యంలో నగర ప్రజలు, వాహనదారులు, పర్యాటకులు ప్రత్యామ్నాయ మార్గాలలో ప్రయాణించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

నిందలు.. చిందులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఒకనాటి రాజకీయ మిత్రులు నేడు శత్రుత్వాన్ని ప్రదర్శించుకుంటున్నారు. విమర్శలు, ఆరోపణస్త్రాలు సంధించుకుంటున్నారు. ఈ రాజకీయ మైదానంలో ఆర్థిక, స్వీయ లబ్ధికోసం ఆడుతున్న క్రీడ తప్ప ప్రజల ప్రయోజనాలేమీలేవు. ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు విలువల కంటే పదవులు పొంది లబ్ధిపొందాలనుకునేవారి మధ్య ఈ పోటీ మరింత రసవత్తరంగా కనిపిస్తోంది. ఎంపీ ఎంవివి సత్యనారాయణ, జనసేన విశాఖ అర్బన్ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ మధ్యనైనా, వైసిపి నాయకురాలు అక్కరమాని విజయనిర్మల, ఎంవివి గ్రూపుల మధ్యనైనా, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు అనుచరులలోనైనా సొంత అజెండా తప్ప ప్రజల అజెండాలేవీ ఇసుమంతైనా లేవు. వీరు ఎంత తీవ్రస్థాయిలో విమర్శ, ప్రతివిమర్శలు చేసుకున్నా తమ అడ్డగోలు సంపాదనకు పదవనే అస్త్రాన్ని అరచేతిలో పెట్టుకోవడానికి ఆడుతున్న ఎన్నికల నాటకంలోని ఓ సన్నివేశం మాత్రమే. ప్రజల ప్రయోజనాల కోసమో, ప్రజలకు జరుగుతున్న నష్టంపైనో భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నవారెవరూ వీరు కాదు. తమ కళ్లముందే ప్రజల సంపద లూఠీ జరుగుతుంటే అడ్డుకోవాలన్న ఆలోచన కలిగినవారంతకంటేకాదు. ఆ లూఠీలో పోటీ తప్ప, అక్రమ సంపాదనలో వక్రమార్గాలు అన్వేషించి రెప్పపాటులో స్థలాలు, భూములు మాయచేసే ఘనాపాటీలు. వీరిలో ఎవరికి ఎవరూ తీసిపోరు.

ఎంవివి సత్యనారాయణ, వంశీకృష్ణ ఆర్థిక పునాదులెవరికీ తెలియనవికాదు. ఆ ఆర్థిక పునాదులపై రాజకీయంగా పైకెలా వచ్చారో వివరించనూ పనిలేదు. ఆర్థిక వ్యవహారాల్లో తలెత్తిన సమస్యలు రాజకీయ వైరానికి



దారితీయడంతో రోడ్డునపడుతున్నారు. యలమంచిలి ఎమ్మెల్యే యువి రమణమూర్తిరాజు, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మధ్య వైరమూ భిన్నాభిప్రాయాలతో ఏర్పడినదికాదు. తన అనుచరణగణాన్ని ముందుపెట్టి వెనుకనుంచి ఆడుతున్న స్థిరాస్థి వ్యాపారంలో తాను తినాల్సిన లాభాన్ని, ఇంకొకడు ఎత్తుకుపోయాడని అక్కసేగానీ, జిల్లాలో కరువు, కాటకాలతో బాధపడుతున్న రైతులకు పరిహారం రాబెట్టడానికి చేస్తున్న కృషిలో వచ్చిన తంటా కాదు. ఎన్ఎఒబి నిర్వాసిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించడానికి చేస్తున్న ప్రయత్నాల్లో గొడవులు కాదు. అచ్యుతాపురం సెజ్‌లో కొత్తగా నిర్మించబోయే 400 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ సబ్ కాంట్రాక్ట్ పనులు వారిద్దరూ తమ అనుచరులకు అప్పగించడానికి పడుతున్న పోటీలో రచ్చకెక్కుతున్నారు. సంపాదన తప్ప సామాజిక ప్రయోజనం పట్టని వారు కాబట్టే శుక్రవారం దేశ వ్యాపిత పారిశ్రామిక సమ్మెకు, గ్రామీణ బంద్ చేపట్టిన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల వెంట మేమున్నామన్న మాట అనలేకపోయారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో పూర్తిగా భాగస్వామికాలేకపోతున్నారు. ప్రయివేటీకరణను అడ్డుకోవడానికి జరుగుతున్న పోరాటంలో అడుగులు వేయలేకపోతున్నారు. ప్రజలే అప్రమత్తమై తమ ప్రయోజనాలను దెబ్బతీసే వ్యక్తులు, నాయకులకు బుద్ధిచెప్పడానికి వచ్చిన ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకోవాలి.

కలగానే ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్

ప్రజాశక్తి -తగరపువలస : ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తగరపువలసలో ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ ఏర్పాటు నేటికీ కలగానే మిగిలిందని చెప్పవచ్చు. జనాభాతో పాటుగానే ప్రజల అవసరాలు కూడా పెరుగుతున్నాయి. అందుకు అనుగుణంగా సదుపాయాలు లేవు.

జఠిలంగా మారిన ట్రాఫిక్ సమస్య

పట్టణంలో ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారిందని చెప్పవచ్చు. విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే బస్సులు హైవే మీదుగా వెళ్తున్నాయి. 222, 55టి తదితర సిటీ బస్సులు లెక్కకు మిక్కిలిగా వస్తూ, వెళ్తుంటాయి. కారణాలు ఏమైనా గానీ రోజు రోజుకు రోడ్డు కుచించుకు పోవడంతో వస్తున్న సిటీ బస్సులు సైతం జంక్షన్‌లో మలుపు తిప్పేందుకు అవకాశం లేక శివాలయం ఎదురుగా ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ ప్రతిపాదిత స్థలం వద్ద మలుపు తిప్పుతున్నారు. మరికొన్ని బస్సులను స్థానిక పాత అన్నా క్యాంటీన్ పక్కనున్న ఖాళీ స్థలంలో మలుపు తిప్పుతున్నారు. స్థానిక జంక్షన్‌లో ఎక్కువ సమయం బస్సులు నిలిపే అవకాశాలు లేవు. ఆటోలు, టాక్సీలు, క్యాబ్‌లు కూడా ప్రయాణికుల కోసం అక్కడే నిలుపుతారు. అసలే ఇరుకైన రోడ్డు, అందునా ఇక్కడి జంక్షన్ నిత్యం రద్దీగానే ఉంటుంది. పద్మ వ్యూహాన్ని తలపించే ట్రాఫిక్‌లో బస్సును ఎక్కువ సమయం నిలపడం సాధ్యం కాదు. బస్ కాంప్లెక్స్ ఉన్నట్లయితే, నిదానంగా బస్సు ఎక్కుతారు. బస్సు ఎక్కువ సమయం ఆగే పరిస్థితి ప్రస్తుతం లేనందున అటు శివాలయం, ఇటు అన్నా క్యాంటీన్ నుంచి వచ్చే బస్సుల్లో సీటు కోసం ప్రయాణికులు పరుగెడుతూ ఎక్కే సమయంలో ఎన్నో సార్లు, ఎంతో మంది ప్రమాదాలకు గురైన సందర్భాలు లేక పోలేదు. ఇక్కడ బస్ కాంప్లెక్స్ నిర్మిస్తామంటూ ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రజలకు హామీ ఇస్తూనే ఉన్నారు. అదిగో, ఇదిగో అంటూ ఏళ్ల తరబడి కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో గెలిచాక శంకుస్థాపనలతో సరిపెట్టేస్తున్నారనేది వాస్తవం. ఇప్పటికైనా బస్సు కాంప్లెక్స్ ఏర్పాటుచేయాలని, పాలకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఏడాదిలో మరో మూడు నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ప్రధాన పార్టీల అభ్యర్థులు మళ్లీ ఇదే అంశంపై హామీ ఇచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు .

ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే నినాదం.. పాలకుల్లో కొరవడిన చిత్తశుద్ధి?



ఆర్‌టిసి బస్సు కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రతిపాదిత స్థలం ఇదే...

పాలకుల్లో కొరవడిన చిత్తశుద్ధి?

ఏళ్ల తరబడిగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధుల్లో చిత్త శుద్ధి కొరవడడం వల్లనే ఆర్‌టిసి బస్సు కాంప్లెక్స్ ఏర్పాటు నేటికీ కలగానే మిగిలిందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. టిడిపి, కాంగ్రెస్, వైసిపికి చెందిన నేతలు ఎమ్మెల్యే, మంత్రి పదవులు చేపట్టినా సరే ఆర్‌టిసి బస్సు కాంప్లెక్స్ ఏర్పాటు జరగలేదని పలువురు వాపోతున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధి సీతమ్మధార తెలుగు తల్లి విగ్రహం సమీపంలో రహదారిపై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. సీతమ్మధార వైపు నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఎపి 31 ఇఒ 8811 నెంబర్ కారు అదుపుతప్పింది. ముందుగా రోడ్డు పక్కన పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొట్టింది. తర్వాత డివైడర్ ఎక్కి పక్కనే ఉన్న నివాస గృహాన్ని కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇంటి వద్ద కూరగాయలు తరుగుతున్న పోలిశెట్టి జగదీశ్వరి (42) అక్కడికక్కడే మృతి చెందింది. ఒక యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. రెండు ద్విచక్ర వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వాహన డ్రైవర్ గణేష్‌కు అకస్మాత్తుగా ఫిట్స్ రావడం ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ధ్రువీకరించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎంవిపి పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మహిళ మృతదేహాన్ని కెజిహెచ్ మార్చురీకి తరలించారు. ప్రమాదం జరిగిన సమయం వాహనంలో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు ఉన్నప్పటికీ వారెవరికీ ఎటువంటి గాయాలూ కాలేదు.

ఇన్‌స్పైర్ పోటీల్లో కెజిబివి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో స్థానిక కెజిబివి పదోతరగతి విద్యార్థిని అనూష ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గంగాకుమారి తెలిపారు. 2023 -24 విద్యా సంవత్సరానికిగానూ ఎంపికైన అనూషను సమగ్ర శిక్ష ఎపిసి శ్రీనివాసరావు, జిసిడిఒ కాలీషా బేగం, ఎజిసి డిఒ గీత, ఎఫ్‌ఎఒ భారతి, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-ఆనందపురం : జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నాలుగు మండలాల అధికారులతో హౌసింగ్‌పై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, పేదలందరి సొంత ఇంటి కల నెరవేరేందుకు పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

పెండింగ్‌లో ఉన్న స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రచరిత్రలో భారీగా ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి, ఆనందపురం తహశీల్దార్ హేమంత్‌కుమార్, భీమిలి, పద్మనాభం, చినగదిలి తహశీల్దారులు, అధికారులు, మూడు మండలాల జడ్‌పిటిసిలు ఎంపిపిలు పాల్గొన్నారు.

పలు సమస్యలపై వినతులు

మండలంలో రివ్యూ చేసేందుకు వచ్చిన అధికారులకు స్థానిక సమస్యలపై పలు వినతిపత్రాలు అందించారు. కనుమాం పంచాయతీలో ఎపిఐఐసి కేటాయించిన భూములకు నేటికీ నష్టపరహారం అందలేదని గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పినిశెట్టి సింహాచలం నాయుడు వినతిపత్రం అందజేశారు, ఆనందపురం ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని, పరిష్కరించాలని తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు కోరారు. సిర్లపాలెం, బోని, ముచ్చర్ల ఇనాం భూములకు సర్వే చేసినా నేటికీ రైతులకు పట్టాదారు పుస్తకాలు మంజూరు చేయలేదని బోని సర్పంచ్ బోని అప్పలకొండ సన్యాసినాయుడు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఆనందపురంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని కోన శ్రీను కోరారు.

13వ వార్డులో కల్వర్టు ప్రారంభం



కల్వర్టు పనులను ప్రారంభిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన బాక్స్ కల్వర్టును వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి శనివారం తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి విశాఖను పరిపాలనా రాజధాని చేయనున్న నేపథ్యంలో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దే క్రమంలో ఇప్పటికే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ, కాలనీ సంఘం నాయకులు వంకర బాబూరావు, కాకర గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో విదేశీ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల అభ్యసిస్తున్న వివిధ దేశాలకు చెందిన విద్యార్థుల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అంతర్జాతీయ విద్యార్థుల యువజనోత్సవం "సంయుక్త-24"లో శనివారం వివిధ విద్యా సంస్థల నుంచి హాజరైన విదేశీ విద్యార్థులు సందడి చేశారు. నేపాల్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ తదితర దేశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సంగీత, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు తమ దేశాల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేషధారణ తో ఇచ్చిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. అంతకు ముందు గీతం హాస్పిటాలిటి విభాగం ఆధ్వర్యాన విదేశీ విద్యార్థుల కోసం నిర్వహించిన వివిధ దేశాల వంటకాల ఫుడ్ ఫెస్టివల్ విద్యార్థులను ఆకర్షించింది. ఈ కార్యక్రమానికి ఉగాండ దేశ విద్యా క్రీడల మంత్రిత్వ శాఖ సహాయ కమిషనర్ డాక్టర్ టి.బైగానవడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గీతం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైరక్టర్ డాక్టర్ కెపి.కిషన్, స్టూడెంట్ లైఫ్ డైరక్టర్ బాలాకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం : వృత్తి విద్య శిక్షణలో భాగంగా ఆనందపురం జిల్లా పరిషత్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు విద్యుత్ వినియోగంపై విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇ సురేష్‌కుమార్ శనివారం అవగాహన కల్పించారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్లో వృత్తి విద్య ఉపాధ్యాయుడు భీష్మ నారాయణ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎఇ సురేష్‌కుమార్ మాట్లాడుతూ, విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ ఎలా సరఫరా అవుతుంది, విద్యుత్తును ఎలా వినియోగించుకోవాలనే విషయాలపై వివరించారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు భాస్కరరావు, శ్రీనివాసరావు, ఆపరేటర్ సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల లక్ష్యం పక్కదారి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి - ఆరిలోవ : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది తమ కాళ్లపై తాము నిలబడాలనే ఉద్దేశంతో స్థాపించిన డ్వాక్రా సంఘాలను ప్రభుత్వాలు తమ స్వార్థంకోసం పక్కదారి పట్టిస్తున్నాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ప్రియాంక అన్నారు. ఐద్వా ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా సంఘాలలో సుమారు కోటి మంది మహిళలు ఉన్నారన్నారు. వారు పొదుపు చేసిన డబ్బులు ఇవ్వకుండా బ్యాంకు అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా వారి స్వార్థంకోసం డ్వాక్రా మహిళలను బలవంతంగా మీటింగులకు తరలిస్తున్నారని చెప్పారు. మీటింగులకు రాకపోతే సంక్షేమ పథకాలను ఆపేస్తామని బెదిరిస్తున్నారని విమర్శించారు. దీంతో ఒక లక్ష్యంతో ఏర్పాటుచేసిన డ్వాక్రా సంఘాలు పక్కదారి పడుతున్నాయని తెలిపారు. ఈ నెల 22 నుంచి 25 వరకు ఐద్వా ఆల్ ఇండియా కమిటీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో డ్వాక్రా సెమినార్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎస్.రంగమ్మ మాట్లాడుతూ పావలా వడ్డీ రావడం లేదని, అభయ హస్తం డబ్బులు అందడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.రమణమ్మ, ఎం.లక్ష్మి, అమ్మాజీ, వి.శాంతి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

శంఖారావం సభకు తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఎం పాలెం : భీమిలి నియోజకవర్గం తగరపువలస వద్ద నిర్వహించిన శంఖారావం సభకు పిఎం పాలెం నుంచి విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన టిడిపి అభిమానులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, కొరగంజి సూరిబాబు, కొల్లి బాబ్జి, తాడేల శ్రీను, సంతోష్, తాడేల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం మండలంలోని 22 పంచాయతీల నుంచి జనసేన, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు శనివారం ఆటోలు, కార్లు, బైకులపై తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కె.నగేష్‌కుమార్, కోరాడ రమణ, కె.దామోదరరావు, కె.లీలావతి, బి.పావని పాల్గొన్నారు.

సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గం వేపగుంట దరి కృష్ణారాయపురం బొడ్డపాటి వారి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం జరిగిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభకు మండలంలోని పలు గ్రామాల నుండి టీడీపీ కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లారు. సబ్బవరం నుండి తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పిబివిఎస్ఎన్ రాజు, పైడివాడ అగ్రహారం మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మీ దుర్గినాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు వెళ్లారు.



పిఎం.పాలెం నుంచి తరలివెళ్తున్న టిడిపి నాయకులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పల్లా శ్రీనివాసరావు తదితరులు

శంఖారావ సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి -గాజువాక : పాత గాజువాక లంక గ్రౌండ్‌లో ఈ నెల 19న నిర్వహించే తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎన్నికల శంఖారావసభ ఏర్పాట్లను శనివారం విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోండా జగన్, పల్లా శ్రీనివాసరావు, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, పెంట్రాజు, రతన్‌కాంత్, గోమడ వాసు, చట్టి గోపి, కోయిలాడ శంకర్రావు, నల్లూరి సూర్యనారాయణ, మాడిసి కనకరాజు, రట్టి వాసు, కొవిరి హరికృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల పోలింగ్‌పై అవగాహనలో పాల్గొన్న విద్యార్థులు

పెన్ స్కూల్లో ఎన్నికలపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : రానున్న ఎన్నికలపై విద్యార్థులలో అవగాహన కల్పించడానికి పెన్ స్కూల్లో మాక్ ఎన్నికల పేరిట కార్యక్రమం నిర్వహించారు. 7, 8, 9 తరగతుల విద్యార్థులు వివిధ గుర్తులతో అభ్యర్థులుగా నిలబడి ఎన్నికలలో పోటీ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్, కరస్పాండెంట్ అనిత పెరేరా మాట్లాడుతూ, ఎన్నికలపై చక్కటి అవగాహన కల్పించేటట్లుగా కార్యక్రమం సాగిందని తెలిపారు.

గర్భకోశ కేన్సర్‌కు ఉచిత వ్యాక్సినేషన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : లైంగిక సంబంధాలు, ధూమపానం వంటి కారణాలతో సంక్రమించే గర్భకోశ ముఖ ద్వార కేన్సర్ బారి నుంచి బయటపడేందుకు సెర్వక్ క్వాడ్రి వేలెంట్ వ్యాక్సిన్‌ను 9 నుంచి 14ఏళ్ల ఆడ పిల్లలకు ఉచితంగా వేసే కార్యక్రమానికి చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ శ్రీకారం చుట్టింది. ఎవిఎన్ కాలేజీ ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్లో శనివారం ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలి విడతగా 50 మంది ఆడ పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేశారు. ఒక్కో డోస్‌కు రూ.2 రెండు వేలు వ్యయం అవుతుండగా అందుకయ్యే రూ.లక్ష ఖర్చును చైతన్య స్రవంతి భరిస్తోంది. ఆరు నెలల తర్వాత రెండో డోస్ వ్యాక్సిన్ వేస్తారు. హ్యూమన్ పపిలోమా వైరస్ కారణంగా గర్భకోశ ముఖ ద్వార కేన్సర్ సోకుతుందని, దీనిపై ఆడపిల్లలు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కెజిహెచ్ రేడియాలజీ, ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి సూచించారు. 9 నుంచి 14 ఏళ్ల వయసుగల వారికి రెండు సార్లు వ్యాక్సిన్ వేయాలని, ఆ తరువాత 14 నుండి 26 ఏళ్ల వయసు గల వారికి మూడుసార్లు వ్యాక్సిన్ వేయాల్సి ఉంటుందని తెలిపారు. తరచూ వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారానే కేన్సర్‌ను గుర్తించగలమన్నారు. శారీరక మార్పులు గుర్తించిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇదివరలో సర్వైకల్ కేన్సర్ ఎక్కువగా ఉండేదని ఇప్పుడు బ్రెస్ట్ కేన్సర్ అధికంగా ఉందని తెలిపారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ, సామాజిక దృక్పథంతో ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేసే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో కేన్సర్ ఎక్కువగా ఉందని చెప్పారు. వివాహమైన వారు కూడా వ్యాక్సిన్ వేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాక్సిన్ సరఫరా చేసే సంస్థ ఏరియా మేనేజర్ రాంప్రసాద్, చైతన్య స్రవంతి ప్రతినిధులు రకియాభాను, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఎయుతో సంయుక్త ప్రాజెక్టుల నిర్వహణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంతో సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించాలని అమెరికాకు చెందిన ఈటాన్ రీసర్చ్ ల్యాబ్ సీనియర్ ప్రిన్సిపల్ ఇంజినీర్ డాక్టర్ విజయ్ భావరాజును ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి ఆహ్వానించారు. శనివారం ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించిన విజయ్‌భావరాజు ప్రసాదరెడ్డితో భేటీ అయ్యారు

పాత పెన్షన్ విధానం అమలుచేయాలి



మజ్జి వెంకటరావుకు కరపత్రాలు అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. పలుచోట్ల పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు.

ఆరిలోవ : యుటిఎఫ్ ఆధ్వర్యాన ఓట్ ఫర్ ఒపిఎస్ కార్యచరణలో భాగంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి మేయర్ చాంబర్ వద్ద యుటిఎఫ్ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తెలియపరచాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో యుటిఎఫ్ చినగదిలి మండలం ప్రధాన కార్యదర్శి జెవి.పద్మావతి, సభ్యులు గోవిందరావు, మూర్తి ఉన్నారు.

ఆనందపురం : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, ఇచ్చిన హామీని జగన్మోహన్‌రెడ్డి నిలబెట్టుకోవాలని యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ డిమాండ్‌చేశారు. మండలంలోని తర్లువాడ గ్రామంలో వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావును కలిసి ఒపిఎస్ విధానంపై జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ కరపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు వై.భాస్కర్, ఆనందపురం మండల అధ్యక్షులు కిరణ్, కోశాధికారి గిడుతూరి రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు ఎమ్.రాంజీ పాల్గొన్నారు

టిడిపి మేనిఫెస్టోలో పెట్టాలని వినతి

అనకాపల్లి : పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ శనివారం టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావుకు యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి, దానిని నెరవేర్చక పోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఓపిఎస్ పునరుద్ధరించాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తున్నట్లు చెప్పారు. ఓపిఎస్ పునరుద్ధరణకు టిడిపి మేనిఫెస్టోలో పెట్టాలని కోరుతున్నామని తెలిపారు. దీనికి స్పందించిన నాగ జగదీశ్వరరావు మాట్లాడుతూ ఈ విషయాన్ని, తమ పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, సీనియర్ నాయకులు దేముడునాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



బుద్ధ నాగజగదీష్‌కు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ పోస్టు కార్డు ఉద్యమం

నర్సీపట్నం టౌన్: ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని వేములపూడి హైస్కూల్‌లో పోస్ట్ కార్డు ఉద్యమాన్ని యుటిఎఫ్ నేతలు చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల కన్వీనర్ అనిమిరెడ్డి సాంబమూర్తి మాట్లాడుతూ, ఈ విషయాన్ని అన్ని పార్టీలు మేనిఫెస్టోలో పెట్టాలని, దీనిపై పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు ఉత్తరాలు రాస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.రామకృష్ణ, ఉపాధ్యాయులు ఆర్ఆర్.స్వామి, కెఎ.నాయుడు, నాగసత్య నారాయణ, మునుస్వామి పాల్గొన్నారు.



నర్సీపట్నంలో పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

ఆదర్శ్ కళాశాలలో స్కిల్ ట్రైనింగ్



శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ప్రజాశక్తి-పెందుర్తి : స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మహేంద్ర ప్రైడ్ క్లాసురూమ్, నాంది ఫౌండేషన్ ఆధ్వర్యాన ఎంప్లాయిబిలిటీ స్కిల్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ టి.థియపియస్ మాట్లాడుతూ, ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఆదర్శ్ కళాశాల విద్యార్థినిలు ఎంతగానో లబ్ధిపొందారని తెలిపారు. మహేంద్ర ప్రైడ్ క్లాసురూమ్, నాంది ఫౌండేషన్, ఎపి స్కిల్స్ డెవలప్‌మెంట్ బృందానికి ఆదర్శ్ డిగ్రీ కళాశాల తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. నాంది ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్స్ రజిని, వేణుగోపాల్, భవాని బృందాన్ని ఆదర్శ్ డిగ్రీ కళాశాల యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల విద్యార్థినులకు సర్టిఫికెట్స్, మెమెంటోలు బహుకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్ఇ.ఫ్లోరా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవిబాబు, వైస్ ప్రిన్సిపల్ రాజు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఆస్ట్రేలియా అడ్మిషన్స్ డే

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విదేశీ విద్యను అభ్యసించాలనుకునే వారికి యూని ఎక్స్‌పర్ట్స్ సంస్థ మంచి అవకాశాలు, వాటిపై సరైన అవగాహన కల్పిస్తుందని సంస్థ విశాఖ బ్రాంచ్ మేనేజర్ అనిత కొమ్మరాజు తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ నెల 19న ఆస్ట్రేలియా అడ్మిషన్స్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పదికి పైగా ఆస్ట్రేలియా యూనివర్సిటీలు పాల్గొంటున్నాయని, విద్యార్థులకు ఇది సువర్ణ అవకాశం అని పేర్కొన్నారు. ఈ అడ్మిషన్స్‌డేకు హాజరుకావడం ద్వారా అప్లికేషన్ ప్రాసెస్, వీసా సర్వీస్, 25 శాతం వరకు స్కాలర్‌షిప్ పొందవచ్చని తెలిపారు. విద్యార్థుల అర్హత ప్రకారం ఆన్ స్పాట్ ప్రొఫైల్ అసెస్మెంట్ పొందుతారని వివరించారు. ఈ ఆస్ట్రేలియా అడ్మిషన్స్ డేకు హాజరయ్యే విద్యార్థులు నేరుగా విశ్వవిద్యాలయ ప్రతినిధులతో మాట్లాడవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 7785968968ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రావాడ నాయుడు అసిస్టెంట్ మేనేజర్స్ శారన్, సైదా, రేఖ పాల్గొన్నారు.



ఆస్ట్రేలియా అడ్మిషన్స్ డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వైసిపి జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు పరిధి అక్కయ్యపాలెం హైవే వద్ద వైసిపి జెండాను ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో మళ్లీ వైసిపి ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి పనులను ప్రభుత్వం చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు పార్టీ అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటి శాఖ మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కెకె.రాజు, డిప్యూటీ మేయర్ సతీష్ పాల్గొన్నారు.

బిసిలను ముఖ్యమంత్రి చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో బిసి నాయకులను ముఖ్యమంత్రి చేయాలని ఆల్ తెలుగు ప్రజా పార్టీ (ఎటిపిపి) విశాఖ పార్లమెంట్ పరిశీలకులు నందికోళ్ళ సంధ్య విజ్ఞప్తి చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తమ పార్టీ తరపున పోటీ చేయనున్న విశాఖపట్నం పరిధి అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కులం, వారసత్వ ప్రాముఖ్యత ఎక్కువగా ఉందన్నారు. సామాన్య ప్రజల సంక్షేమం కోసం మేధావుల సహకారంతో ముందుకు వెళతామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ పనితీరు బాగా లేదన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ల ప్రకారం పార్టీ టిక్కెట్లు ఇస్తుందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామన్నారు. రాష్ట్రంలో 174 స్థానాలకు పోటీ చేస్తామని,తెలిపారు.

ఆర్ఎఆర్ఎస్ కార్మికుల ధర్నా

కనీస వేతనాలు చెల్లించాలని

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆచార్య యన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో రోజువారీ కూలీలుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆచార్య యన్ జి రంగ వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం కార్మికుల ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ లేబర్ కమిషన్ ఆర్డర్ ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని, రాష్ట్ర కార్మిక శాఖ జారీ చేసిన జాతీయ పండుగ సెలవులు (వేతనంతో కూడిన) కాంట్రాక్ట్ లేబర్ అందరికీ వర్తింపజేయాలని కోరారు. కార్మికులు మరణిస్తే సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షలు రూపాయలు పరిహారం చెల్లించేందుకు జారీ చేసిన జీవోను కాంట్రాక్ట్ లేబర్‌కు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కార్మికులు పాముకాటుకు, ఇతర ప్రమాదాలకు గురైనప్పుడు రీసెర్చ్ స్టేషన్ అధికారులు బాధ్యత తీసుకొని వైద్యం చేసేలా చర్యలు తీసుకోవాలని, యూనివర్సిటీ పరిధిలో ఖాళీ పోస్టుల భర్తీలో కాంట్రాక్ట్ కార్మికులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కొణతాల సంతోష్ కుమార్, ఇసరపు లక్ష్మి, మళ్ళ లక్ష్మి, నక్కా మంగాదేవి, పల్లా రమాదేవి, వేంకట లక్ష్మి, చందక లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.



ఆర్ఎఆర్ఎస్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య

పోక్సో చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళలు పోక్సో యాక్టును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య సూచించారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం మహిళలకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవిద్య మాట్లాడుతూ చాలామంది చట్టాలను ఉపయోగించుకోవడంలో నిర్లిప్తతగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మహిళా రక్షణకై అనేక చట్టాలను ప్రవేశ పెట్టాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో 200 మంది మహిళలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప, రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, డీఈఓ వెంకట లక్ష్మమ్మ, ప్రెసిడెంట్ సాయి, ఎంఎల్ఎస్‌సి ప్రతినిధి సత్యనారాయణ, లక్ష్మణ్, సెక్రటరీ సూర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిఎల్ఒలు నిబద్ధతతో పనిచేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఓటర్ల నమోదు ప్రక్రియలో నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ బిఎల్ఒలు, సూపర్ వైజర్లను ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా 2024లో భాగంగా గత నెల 22న తుది జాబితా ప్రచురణ అయిందని తెలిపారు. ఆ జాబితా తదుపరి నమోదు అవుతున్న ఫారం - 6, 7, 8లను బిఎల్ఒలు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. శనివారం ఉదయం ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో బిఎల్ఒల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా బిఎల్ఒలు, సూపర్ వైజర్లు పనిచేయాలని చెప్పారు. డెత్ కేసులు, డూప్లికేట్ ఓటర్లు వంటివి ఉన్నట్లయితే అటువంటి గృహాలను స్వయంగా సందర్శించి, కచ్చితమైన సమాచారంతో వాటిని పరిష్కరించాలని తెల్పిచెప్పారు. ఇందులో ఎటువంటి పొరపాట్లకూ తావులేకుండా, ఒత్తిడిలకు గురికాకుండా పారదర్శకంగా పనిచేయాలని స్పష్టం చేశారు. తప్పులు దొర్లితే సంబంధిత బిఎల్ఒలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. శిక్షణ కార్యక్రమంలో డిఆర్ఒ కె.మోహన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎరుకునాయుడు ఆదర్శనీయుడు

ప్రజాశక్తి-కె.కోటపాడు

గుమస్తాగా ఉద్యోగం జీవితాన్ని ప్రారంభించి కఠోర శ్రమతో విశ్వవిద్యాలయం ఆచార్యునిగా ఉన్నత శిఖరాలకు ఎదిగిన రొంగలి ఎరుకునాయుడు ఆదర్శనీయులని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు అన్నారు. లా ప్రొఫెసర్ పని చేసి ఇటీవల మృతి చెందిన మండలంలోని రొంగలినాయుడుపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత ఆచార్యులు రొంగలి ఎరుకునాయుడు సంస్మరణ సభ శనివారం జరిగింది. ఇందులో పాల్గొన్న ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎరుకునాయుడు ఆంధ్రా యూనివర్సిటీలో లా కాలేజీ ప్రొఫెసర్‌గా సేవలందించారన్నారు. ఈ సంతాప సభలో విశ్రాంత న్యాయమూర్తులు పి.ముత్యాల నాయుడు, ఎల్.శ్రీరామమూర్తి, విశ్రాంత రిజిస్ట్రార్ దామోదర్, విశ్రాంత ప్రిన్సిపాల్ పూడి సత్యనారాయణ, కంపెనీ సెక్రటరీ అడిగర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బత్తిన నోబుల్‌కుమార్ మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమేనని, విద్యార్థులందరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ముందుగా 9వ తరగతి విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బత్తుల అనురాధ, స్కూల్ ప్రిన్సిపాల్ సాజిథా, రూపానంద, అకాడమిక్ ఇన్‌ఛార్జ్ చంద్రమౌళి, విద్యార్థులు పాల్గొన్నారు.



వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి, సంక్షేమం

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలో ప్రతి గ్రామంలోనూ రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించామని, గడపగడపకు సంక్షేమ పథకాలు అందించామని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో శనివారం అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు చేశారు. మేడిచర్ల గ్రామంలో సిసి రోడ్లు, వాటర్ ట్యాంక్, రొంగలినాయుడు పాలెంలో రు.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన భవనాలను, చౌడువాడ గ్రామంలో రూ.43.60 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.23.94 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్‌ను, మల్లంపాలెంలో రూ.60 లక్షలతో నిర్మించిన అంతర్గత సిసి రోడ్లను, ఇంటింటి కుళాయిలు డిప్యూటీ సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసేవల నిమిత్తం గ్రామాల్లో సచివాలయం భవనాలను, రైతులకు మెరుగైన సేవలందించే దిశగా ఏర్పడిన రైతు భరోసా కేంద్రాలను, అత్యవసర వైద్య సేవలకు హెల్త్ క్లినిక్‌లు, తాగునీటికి ఇంటి ఇంటికి కుళాయిలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ఈర్లె అనురాధ, ఎంపిపి రెడ్డి జగన్మోహన్, మండల, గ్రామ స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం బూడి

పాత నేరస్తులను బైండోవర్ చేయాలి

జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో అల్లర్లు, సమస్యలు సృష్టించేవారిని, పాత నేరస్తులను బైండోవర్ చేయాలని జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో శనివారం నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సిఆర్‌పిసి కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయడానికి పలు సూచనలు చేశారు. రాబోవు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ఆయా పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ, గ్రామసభలు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఆదేశించారు. ఎన్ఫోర్స్మెంట్ ముమ్మరం చేసి చట్ట వ్యతిరేక/ అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రతిభ కనబరిచిన 12 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలతో జిల్లా ఎస్పీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, పి.సత్యనారాయణ రావు, డిఎస్‌పిలు వి.సుబ్బరాజు, కె.వి.సత్యనారాయణ, బి.వెంకటరామయ్య, బి.అప్పారావు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ మూర్తి, చంద్ర శేఖర్, ఎస్సై రఘువర్మ, పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో ఈనెల 18న ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సూర్య హెల్త్ కేర్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో షుగర్ వ్యాధి, జనరల్ సర్జన్, చిన్నపిల్లలు, ఆర్థోపెడిక్ నిపుణులు, జనరల్ మెడిసిన్, దంత వైద్యం తదితర వైద్య నిపుణులు పాల్గొని రోగులకు ఆయా వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మండలంలోని రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మహిళలకు కోలాటం శిక్షణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కోలాటం వేయడం వలన మహిళలకు శారీరక దారుఢ్యం పెరుగుతుందని చూడమాంబిక ఆలయ ధర్మకర్త కర్రి నాగేశ్వరరావు చెప్పారు. చౌడపల్లి గ్రామంలో అమ్మవారి ఆలయ ఆవరణలో శనివారం కోలాటంలో శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికే పరిమితమైన మహిళలు శారీరక శ్రమ తక్కువగా ఉండటం వలన అనేక అనారోగ్యాలకు గురవుతున్నారని చెప్పారు. కోలాటం వలన శరీరానికి వ్యాయామం చేసినట్లు అవుతుందని, తద్వారా అన్ని అవయవాల్లో కదలికలు ఏర్పడి ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ శిక్షణలో 30 మంది మహిళలు పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్'ను తిలకించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : రాజధాని ఫైల్స్ సినిమా రాజధాని రైతుల త్యాగాలు, పోరాటాలకు నిలువుటద్దంగా ఉందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు తెలుగుదేశం శ్రేణులతో కలిసి శనివారం రాజధాని ఫైల్స్ సినిమాను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా దర్శక, నిర్మాతలు అమరావతిలో జరిగిన వాస్తవాలను చూపించారన్నారు. ప్రజలందరూ రాజధాని ఫైల్స్ సినిమా చూసి అమరావతిలో జగన్ చేసిన విధ్వంసాన్ని, వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. మూడు రాజధానుల పేరుతో జగన్ విశాఖ ప్రజలనూ మోసం చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర, టిడిపి నాయకులు పోలారపు త్రినాథ్, సురే సతీష్, పిట్ట రాజు, దాడి జగన్, బుద్ధ భూలోక నాయుడు, కర్రి బాబి, బద్రి, కొణతాల ఉమా, మళ్ళ వెంకట్రావు, మళ్ళ సంతోష్, బొడ్డెడ దేవయ్య, మళ్ళ అచ్చయ్య, ఎస్.భానుచందర్ పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - పాయకరావుపేట : మండలంలోని పెదరామభద్రపురం గ్రామంలో దిగుమర్తి ఫౌండేషన్ ఆధ్వర్యాన కేన్సర్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌పివి నియంత్రణకు టీకాలు వేశారు. మహిళలకు స్క్రీనింగ్ నిర్వహించారు. మానవసేవ సంస్థ సహకారం అందించిన ఈ శిబిరాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. డాక్టర్ రఘునాథరావు, డాక్టర్ లీలల పర్యవేక్షణలో డాక్టర్ పుట్టా శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ శరత్, డాక్టర్ ప్రియాంక సేవలు అందించారు.



వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న అధికారులు

జల్ జీవన్ మిషన్‌పై శిక్షణ

ప్రజాశక్తి-కశింకోట : జల్ జీవన్ మిషన్‌పై డ్వాక్రా మహిళలకు శిక్షణ కార్యక్రమం శనివారం కశింకోట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కో-ఆర్డినేటర్ వుల్లయ్య మాట్లాడుతూ జల్ జీవన మిషన్‌లో పథకం కింద ఇంటి ఇంటికీ కుళాయిల ఏర్పాటులో డ్వాక్రా మహిళలు భాగస్వామ్యం ఉంటుందని చెప్పారు. ఒక గ్రామ జల సంఘంలో 9 మంది డ్వాక్రా మహిళలతో పాటు పంచాయతీ సెక్రటరీ, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ మొత్తం 11 మంది సభ్యులతో బ్యాంక్ ఖాతా తెరిచి, లావాదేవీలు ఈ 11 మంది నడిపిస్తారని తెలిపారు. జల కమిటీలు ఏవిధంగా నడిపించుకోవాలో తెలియజేశారు. అన్ని కమిటీలు బ్యాంక్ అకౌంట్లు కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ వర్క్స్ (జిజిఎస్)గా ఓపెన్ చెయ్యాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పావని, ఏరియా కో-ఆర్డినేటర్ వి.ధర్మారావు, ఎంఎస్ అధ్యక్షులు లక్ష్మి, ట్రెజరర్ పార్వతి, సెక్రటరీ నాగలక్ష్మి, ఏపిఎం ఎస్.శ్రీనివాసరావు, ఈసి సభ్యులు, సీసీలు సత్యనారాయణ, శ్రీను, రామకృష్ణ, అనురాధ, నిర్మల పాల్గొన్నారు.

బీసీలకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

వెనుకబడిన తరగతులకు అన్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పాలని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టిడిపి బీసీ సెల్ నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా నాగజగదీష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఆయా బీసీ కులాలకు 56 కార్పొరేషన్ల ఏర్పాటు చేసినా, వాటి ద్వారా రాష్ట్రంలో ఉన్న 138 బీసీ కులాలకు చెందిన వారికి ఏ ఒక్కరికీ ఎలాంటి ప్రయోజనం జరగలేదని తెలిపారు. బీసీలు తనకు వెన్నుముక అంటూనే ముఖ్యమంత్రి వారి వెన్ను విరిచాడన్నారు. 56 బీసీ కార్పొరేషన్ల ద్వారా అనేక ఫైనాన్షియల్ సంస్థల ద్వారా లక్షల కోట్ల అప్పులు తెచ్చిన ముఖ్యమంత్రి జగన్, వాటి ద్వారా ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా యావత్తు బీసీ సమాజాన్ని మోసం చేస్తుంటే ప్రభుత్వంలో భాగస్వాములైన బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు నోరుమెదపలేదని ఆరోపించారు. రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం హయాంలో బీసీలపై దాడులు జరిగాయన్నారు. గుడాల సత్యనారాయణముదిరాజ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేపట్టిన కులగణనకు చట్టబద్ధత లేదని, ఇది కూడా బీసీలను దగా చేసేందుకేనని చెప్పారు. కార్యక్రమంలో బిసి నాయకులు బత్తుల లక్ష్మీ, సబ్బి శ్రీనివాసరావు యాదవ్, సారిపల్లి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

కేన్సర్ వ్యాధిగ్రస్తురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని అప్పన్నపాలెం గ్రామంలో కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న బుద్ధిరాలు ఏక గైరమ్మకు అప్పన్నపాలెం కాలనీ యువకులు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు ఆధ్వర్యంలో శనివారం రూ.40వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా తాతబాబు మాట్లాడుతూ ఏక గైరమ్మ కొన్ని నెలలుగా కేన్సర్‌తో బాధపడుతుండగా, అప్పన్నపాలెం కాలనీ యువకులు, మహిళలు ముందుకొచ్చి సహాయం అందించేందుకు విరాళాలు ఇచ్చారని చెప్పారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ గైరమ్మకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువకులు పైల ప్రవీణ్, గొర్లె నర్సింగరావు, గొర్లె నాని, రంగాల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

అవగాహనతోనే రహదారి భద్రత సాధ్యం

జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన కలిగించడం మూలంగానే పటిష్టమైన రహదారి భద్రత సాధ్యమవుతుందని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి అన్నారు. 35వ రహదారి భద్రతా వారోత్సవాలు సందర్భంగా శనివారం స్థానిక రింగ్ రోడ్డు జంక్షన్ నుండి నెహ్రూచౌక్ వరకు పోలీసు, రవాణాశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టరు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణం, సాధికారిత, అవగాహనను అనుసరిస్తే ఎటువంటి ప్రమాదాలు సంభవించవన్నారు. రోడ్లు, ట్రాఫిక్ లైట్లు, చిహ్నాలు మొదలైనవి పాడైనట్లయితే వెంటనే తగిన మరమ్మతులు చేయాలన్నారు.

జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రమాదాలకు అవకాశం వున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి డ్రైవర్లను అప్రమత్తం చేయడం, జరిమానాలు, అవగాహనా సదస్సులను నిర్వహించడం వలన ప్రమాదాల సంఖ్య స్థాయి తగ్గిందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు, ఆటో, బస్సు, లారీ డ్రైవర్లకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. గత అనుభవాలను పరిగణనలోనికి తీసుకుని తగిన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మద్యంపానం చేసి, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించక పోవడం వల్లనే మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. కూడళ్లను దాటుతున్నప్పుడు పెద్దగా హారన్ మోగించరాదని, బాటసారులు రోడ్డు దాటే సమయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డిఎస్‌పి సుబ్బరాజు, జిల్లా రవాణా అధికారి ప్రకాశరావు, డిపియమ్‌సి సభ్యుడు అప్పారావు, ఆటో డ్రైవర్లు, వాలంటీర్లు, పోలీసు, రవాణా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకుంటామని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నక్కా లక్ష్మణరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 1055వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడంలో అందరికంటే ఎక్కువ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుందన్నారు. దీక్షల్లో కుప్పిలి రామకృష్ణ, ఎంఎస్.కృష్ణ, పివి.రమణ, ఎస్.చిన్న అప్పారావు, పొక్కల కృష్ణ, కేసుబోయిన అప్పలరాజు, పెద్దాడ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న టిఎన్‌టియుసి నాయకులు

ఎన్నికల విధి విధానాలు పాటించాలి

జిల్లా అదనపు ఎస్‌పి విజయ భాస్కర్

ప్రజాశక్తి- అనకాపల్లి

ఎన్నికల విధివిధానాలు, నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు ఎస్పీ బి విజయభాస్కర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. రాబోవు ఎన్నికలను సమర్థవంతంగా విధులు నిర్వహించుటకు ప్రణాళికా బద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలోని పోలీస్ అధికారులకు, సిబ్బందికి శనివారం అనకాపల్లి రోటరీ క్లబ్ సమావేశ హాల్లో ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల ప్రక్రియ, విధి విధానాలు, ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళి, ఎలక్షన్ సంబంధిత చట్టాలు, నేరాలు, అక్రమ గంజాయి రవాణా, మద్యం, నగదు, ఇతర వస్తువులు సీజు చేయు ప్రక్రియ, తరచూ గ్రామాలు సందర్శించి సమాచారం సేకరించడం, అక్కడ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు తదితర అంశాలపై అదనపు ఎస్పీ స్వయంగా వివరించారు. ఎన్నికల విధుల నిర్వహణలో పోలీసులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ తరువాత తీసుకోవలసిన చర్యలు గురించి వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటినుండి ఎన్నికల ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగిసే వరకు పోలీసు ఆఫీసర్లు, సిబ్బంది సమన్వయంతో విధులను నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ సబ్ డివిజన్ డిఎస్పి కె.వి.సత్యనారాయణ, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పి వి.సుబ్బరాజు, ట్రైనీ డిఎస్పీ భవ్య, ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, గణేష్, కుమారస్వామి, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఎస్‌పి విజయభాస్కర్

వైసిపి పంచాయతీ వింగ్ జిల్లా ఉపాధ్యక్షునిగా కొండబాబు



జోగా కొండబాబు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

వైసిపి మండల అధ్యక్షులు జోగా కొండబాబు ఆ పార్టీ పంచాయతీ వింగ్ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితు లయ్యారు. మండలంలో యాదవ్ నేతగా గుర్తింపు పొందిన జోగా కొండబాబును ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఈ పదవికి నియమించారు. కొండబాబుకు అనకాపల్లి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బంధువులు, స్నేహితులు ఉన్నారు. ఈ సందర్భంగా జోగా కొండబాబు మాట్లాడుతూ వైసిపిని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

వైసిపి సేవాదళ్ జిల్లా అధ్యక్షునిగా శ్రీను, చేనేత విభాగం అధ్యక్షులుగా సూరి అప్పారావు



కారుకుండి శ్రీను

అచ్యుతాపురం : వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా కారుకుండి శ్రీను నియమితులయ్యారు. శ్రీను గత 10 సంవత్సరాలుగా వైసిపికి సేవలు అందిస్తున్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి సేవాదళ్ అధ్యక్షుడిగా ఎంపిక చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. వైయస్సార్ పార్టీ జిల్లా చేనేత విభాగ అధ్యక్షుడిగా సూరి అప్పారావును నియమించారు. ప్రస్తుతం అతను దుప్పుతురు గ్రామ చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు.

20న మాడుగులలో టిడిపి శంఖారావం సభ

ప్రజాశక్తి-దేవరాపల్లి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జయహో శంఖారావం సభ ఈనెల 20న ఉదయం 10 గంటలకు మాడుగులలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మాడుగుల నియోజకవర్గం ఇన్చార్జి పివిజి కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, జనసేన మాడుగుల నియోజకవర్గం ఇన్చార్జి రాయపురెడ్డి కృష్ణ తెలిపారు. మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కె.కోటపాడు మండలం గొండుపాలెంలో చంద్రబాబు తలపెట్టిన రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విధంగా శంఖారావం సభను జయప్రదం చేయాలని కోరారు. శంఖారావం కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ సూర్యనారాయణ, శరకాన సూర్యనారాయణ, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైయస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను వైసిపి నెరవేర్చిందని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచారన్నారు. మండలంలో గత ఐదేళ్లలో 225 కోట్ల ఐదు లక్షల రూపాయలు డ్వాక్రా రుణమాఫీ జరిగిందని తెలిపారు. నాలుగో విడత రుణమాఫీ కింద రూ.13 కోట్ల 53 లక్షలను చెక్కును మహిళలకు అందజేసినట్లు చెప్పారు. రానున్న ఎన్నికలలో పెందుర్తి నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా తనకే అవకాశం ఇచ్చారని, ప్రజలు మళ్లీ తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి రామానాయుడు, మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాల నాయుడు, వైసిపి నాయకులు కర్రి బాబు, సబ్బవరపు నారాయణమూర్తి, వడ్డాది అప్పలరాజు, రాపేటి రాము, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, ఈఓఆర్‌డి ఓ.మహేష్, వెలుగు ఏపిఎం సాయి రమేష్, పలు శాఖలు అధికారులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

అనారోగ్యంతో మృతి చెందిన ఆర్.భీమవరం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త, మండలంలోని రాజాం విద్యుత్ సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ రొంగలి నర్సింగరావు (35) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్.రాజు, టిడిపి నియోజకవర్గం ఇన్చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. నర్సింగరావు అనారోగ్యంతో శనివారం మృతి చెందగా, రాజు, తాతయ్యబాబుతో పాటు తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గునూరు మల్లు నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, వివిధ గ్రామాల నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. నర్సింగరావు కుటుంబాన్ని పరామర్శించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. నర్సింగరావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని నేతలు చెప్పారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి -కొత్తకోట:గ్రామ, వార్డు వాలంటీర్ల సేవలు అభినందనీయమని, వీరితో పేదలకు మెరుగైన సేవలను అందించగలుగుతున్నామని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కొనియాడారు. కొత్తకోట పంచాయతీ ఆవరణలో శనివారం సాయంత్రం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, మన రాష్ట్రంలో వాలంటీర్ వ్యవస్థ ఒక కొత్త చరిత్రను తిరగరాసిందని, కొత్త పాలనా విధానానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. మిగిలిన రాష్ట్రాల్లో కూడా వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలనేటు వంటి ఒక కొత్త ఆలోచనకు ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక నమూనా కావడం సంతోషదాయకమన్నారు. గతంలో కన్నా ప్రోత్సాహకాలు పెంచడం జరిగిందని సేవా మిత్రాకు రూ 15వేలు, సేవా రత్నాకి 30 వేలు,సేవా వజ్ర కూ 45 వేలు ప్రభుత్వం ఇస్తున్నట్లు వెల్లడించారు. సేవ చేసే వ్యక్తులను గౌరవించాలనే టువంటి ఆలోచన అద్భుతమన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీ పైల రాజు, .మండల కన్వీనర్ జగ్గారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దంట్ల వెంకటరమణ, కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు సత్యదేవ్, గ్రామ సర్పంచ్ లోవరాజు, జిల్లా వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బంటు సన్యాసినాయుడు, ఎంపిటిసి పూడి దేవ, గాలి రమణ, బాబు, గణేష్, గున్నాజి, బేతా పాండు పాల్గొన్నారు...



కొత్తకోటలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

వాలంటీర్లకు ఘన సత్కారం

గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురం మేజర్ పంచాయతీలో గ్రామ సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత అధ్యక్షతన వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎల్ పురం -1 నుండి ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లు గొంప గోవింద్‌కు సేవా వజ్రా రూ.45వేలు, అడ్డాల ప్రశాంత్‌కి సేవా రత్న రూ.30వేలు, మిగిలిన 41 మంది వలంటీర్లకు నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర నాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి చేతుల మీదుగా సన్మాన పత్రాల అందించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధానంగా ఉంటూ సంక్షేమ పథకాలను అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ, వీఆర్వో సాంబమూర్తి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ..

మార్కెట్ యార్డ్‌లో దుకాణాల ఏర్పాటు

ప్రజాశక్తి -కొత్తకోట:పంచాయతీ నిబంధనల మేరకే మార్కెట్ యార్డ్‌లో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్టు కొత్తకోట సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా స్పష్టం చేశారు. శనివారం పలు పత్రికలలో వచ్చిన వార్తలపై వారు స్పందించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ, సుమారు రూ.15 లక్షల నా బార్డు నిధులతో మార్కెట్ యార్డ్ నిర్మాణం జరిగిందన్నారు. చిరు వ్యాపారులను ప్రోత్సహించేందుకు దుకాణాల నిర్మాణం చేస్తున్నట్టు చెప్పారు. వ్యాపారి తన సొంత నిధులతో దుకాణం నిర్మించు కుంటున్నారని, ఆ వ్యాపారి మూడేళ్ల పాటు కొనసాగుతూ ప్రతి నెల అద్దె కూడా చెల్లిస్తారని పేర్కొన్నారు. మూడేళ్ల అనంతరం పంచాయతీ స్వాధీనం చేసుకొని మరో మూడే ళ్లకు వేలం పాట నిర్వహన ఉంటుందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. పంచాయతీ పాలక వర్గం తీర్మానం మేరకు మార్కెట్ యార్డ్ అభివృద్ధి కి పలు చర్యలు చేపట్టామని, ఇందులో భాగంగానే దుకా ణాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పంచాయతీ కి ఇంటి పన్నులు మినహా ఎటువంటి ఆదాయం లేదని మార్కెట్ ద్వారా ఆదాయం సమకూర్చడానికి తమ వంతు ప్రయత్నం చేస్తూన్నామని ఇది ఓర్వలేక టిడిపి, బిజెపి నాయకులు లేని పోనీ ఆరోపణలు చేస్తూ అభివృద్ధి ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిం చారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పూడి దేవ, మాజీ ఉప సర్పంచ్ కె.గున్నాజీ, పంచాయతీ కార్యదర్శి కె. కృష్ణ మోహన్, వార్డు సభ్యులు గుమ్ముడు దొరబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ ,తదితరులు

28 వరకూ సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలో ఉపాధి పనులపై ఈ నెల 28వ తేదీ వరకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపిడిఒ జాన్‌లింకన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపై 31 పంచాయతీల పరిధిలో తనిఖీలు చేస్తారన్నారు. ఎక్కడైనా పనుల్లో అవకతవకలు జరిగితే కూలీలు, ప్రజలు తనిఖీ బృందాలకు నిర్భయంగా తెలియజేయ వచ్చునన్నారు. తనిఖీల్లో గుర్తించిన అవకతవలను వెల్లడించేందుకు 29న ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు.


పరిశీలిస్తున్న తహశీల్దార్

పోలింగ్ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలో ఓటర్ పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ మురళీ మోహన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఎల్‌ఒలకి, వీఆర్వోలకి పోలింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పోలింగ్ స్టేషన్లో మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్‌పై అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, బిఎల్వోలు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గొలుగొండ:ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ సిపిఎస్ఈఎ జిల్లా ఉపాధ్యక్షులు జి.రవీంద్రబాబు పిలుపునిచ్చారు. శనివారం జోగంపేట హైస్కూల్లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంధ్రబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ పెన్షన్ హామీ ఇవ్వని ఎన్నో రాష్ట్రాలు తొలగించి, పాత పెన్షన్లను పునరుద్ధరణ చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శంకర్రావు, లోవరాజు మణేశ్వరరావు, కుమారి మహాలక్ష్మి, బాను చందర్, చైతన్య పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆరోగ్యశ్రీ యాప్‌తో ప్రయోజనం

ప్రజాశక్తి -వడ్డాది:ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వైద్య సదుపాయం ప్రభుత్వం కల్పిస్తుందని ఏపిఎం బాలరాజు తెలిపారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది పంచాయతీ సచివాలయంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కుటుంబం ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. టచ్ మొబైల్లో గూగుల్ ప్లే స్టోర్ లో ఆరోగ్యశ్రీ యాప్‌ని డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఆ వెంటనే ఆధార్ నెంబర్ ఎంటర్ చేస్తే ఓటిపి ఆ మొబైల్ కి మెసేజ్ రూపంలో వస్తుందని, ఎంటర్ చేసి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్‌తో ఆరోగ్యశ్రీ సేవలు ఏ హాస్పిటల్లో ఉన్నాయో తెలుస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సచివాలయం సిబ్బంది, వెలుగు సిసి కే.గణపతి, విఒఏలు, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎపిఎం



మాట్లాడుతున్న పోతల ప్రసాద్

అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అవకాశం ఇస్తే అనకాపల్లి ఎంపిగా పోటీ చేస్తానని ఆలిండియా ఓబీసీ అసోసియేషన్ (జ్యోతిబాపూలే) జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ నాయుడు తెలిపారు. స్థానిక కృష్ణాప్యాలెస్‌లో బీసీ విద్యార్థులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, పదవి ఉన్నా, లేకపోయినా బీసీల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్లో బీసీల అభ్యున్నతి కోసం 56 బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా బీసీల సామాజిక చైతన్యానికి కృషి చేసిన జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. విద్యా, వైద్య రంగాల్లో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో బీసీలు అత్యధికంగా లబ్ధి పొందుతున్నారన్నారు.

19, 21 తేదీల్లో ఉత్సవాలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొవ్వూరు గ్రామంలో ఈ నెల 19న గౌరీమహోత్సవం, 20న అనుపు మహోత్సవం, 21 మంగళవారం వీరాంజనేయస్వామి మహోత్సవం నిర్వహించ నున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. సాంఘిక నాటకం ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటేశ్వరరావు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-రోలుగుంట:ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో వికలాంగులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటు గురించి ప్రత్యేక యాప్ ఏర్పాటు చేశారని, ఓటు ఉందో లేదో వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు ఎటువంటి ప్రలోభాలను లొంగకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ రవిచంద్ర, డిప్యూటీ తహశీల్దార్ అప్పారావు, పంచాయతీ సెక్రటరీ రవికిరణ్, వీఆర్వో నానాజీ పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యాన నిరసన దీక్ష

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:తాండవ రిజర్వాయర్ ప్రధాన గేట్ల మరమ్మతు చేపట్టాలని జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్షలు నిర్వహించారు. ముందుగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర మాట్లాడుతూ, గేట్ల మరమ్మత్తు చేపట్టాలని ఎన్నో సార్లు ప్రభుత్వం దృష్టికి వివిధ రూపాల్లో తెలియజేశామన్నారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో ఇటీవల వచ్చే పంట కాలంలో రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తక్షణమే 7లక్షల గ్రాంటు విడుదల చేసి మరమ్మత్తులు పనులు చేపట్టాలని, జనసేన పార్టీ తరపున లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రచార కమిటీ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నర్సీపట్నం రూరల్ అధ్యక్షులు మోపాడ చిరంజీవి, రూరల్ ఉపాధ్యక్షులు కిరణ్, మాకవరపాలెం వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ పాల్గొన్నారు.



దీక్ష చేపడుతున్న నేతలు



మాట్లాడుతున్న నాయకులు

లోకేష్ శంఖారావం సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని ఘాటి రోడ్ జంక్షన్ వద్ద ఈనెల 20న లోకేష్ శంఖారావం కార్యక్రమానికి 6,000 మంది పార్టీ క్యాడర్‌కు ఆహ్వానాన్ని తెలిపినట్లు తెలుగుదేశం మాడుగుల నియోజకవర్గ ఇన్చార్జ్ పివి జి కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చే వారందరికీ సదుపాయాలపై పరిశీలన చేసి పార్టీ నేతలకు వివిధ బాధ్యతలను అప్పగించారు. శంఖారావంను నాయకులు, కార్యకర్తలు జయంప్రదం చేయాలని కోరారు. ఈ స్థల పరిశీలనలో మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, జనసేన మండల అధ్యక్షులు శివాజీ, మండల పార్టీ అధ్యక్షులు జగ్గారావు, చీడికాడ మండల పార్టీ అధ్యక్షులు చిన్నమనాయుడు, దేవరాపల్లి మండల పార్టీ అధ్యక్షులు సూర్యనారాయణ, పోల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు రాము పాల్గొన్నారు.



రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

శునకాలతో భయం..భయం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండల కేంద్రంలో కుక్కల బెడదా ఎక్కువ కావడంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. కోళ్లు, ఆవుదూడలపైన కుక్కలు దాడి చేస్తున్నాయి. అంతేకాక రాత్రులు కుక్కల తీవ్రంగా అరవడంతో నిద్ర కూడా లేకపోతుందని స్థానికులు వాపోయారు. ఇటీవల ఈ విషయంపై జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పలువురు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని సత్యనారాయణను వివరణ కోరగా కుక్కల సమస్యపై పంచాయతీలో చర్చించడం జరిగిందన్నారు. సర్పంచ్ పూర్తి సహాయ సహకారాలు అందించకపోవడంతో కుక్కల నిర్మూలన చెప్పట్ట లేకపోయామని తెలిపారు.



ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న ఎస్‌పి

పోలీసులకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన వారికీ ప్రశంసా పత్రాలు అందించినట్లు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో రాయవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది రాము, నానాజీలకు జిల్లా ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిని నక్కపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పన్న అభినందించారు.

గోపాలమిత్రల గోడు వినేదెన్నడో?

-నాలుగు నెలల నుంచి అందని గౌరవ వేతనాలు
-ఐదేళ్లుగా చెల్లించని ప్రోత్సాహక బకాయిలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రెండు దశాబ్దాల కు పైగా గ్రామాల్లో ఉన్న పాడి రైతులకు, మూగ జీవాలకు సేవలు అందిస్తున్న గోపాలమిత్రల సమస్యలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. నాలుగు సంవత్సరాలుగా రైతుభరోసా కేంద్రాల్లో ఇప్పటివరకూ గోపాలమిత్రలతో చాకిరీ చేయించుకుని నూతనంగా పశు సహాయకులను నియమించింది. దీంతో, ఉమ్మడి జిల్లాలో ఉన్న 150 మంది కుటుంబాలు రోడ్డున పడ్డారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రోత్సాహక నగదు ఇప్పటివరకూ చెల్లించలేదు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత పశపోషకుల నుంచి వసూలు చేసిన సొమ్ము మొత్తం ఖజానాలో జమ చేసుకుని గోపాలమిత్రలకు మొండిచేయి చూపుతోంది. బకాయిల పేరెత్తితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ ఉన్నతాధి కారులు బెదిరించ డంతో నోరు మెదపలేని స్థితిలో ఉన్నారు.

కృత్రిమ గర్భ ధారణ ద్వారా మేలు రకం పశుజాతి పెంపొందించే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం గోపాల మిత్ర వ్యవస్థను 2001లో ప్రారంభించారు. పదవతరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చి వారి సొంత గ్రామాల్లో విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించారు. 2008లో 1200తో ప్రారంభమైన గౌరవ వేతనం చంద్రబాబు ప్రభుత్వంలో రూ.6500 పెరిగింది.

వీటితో పాటు సెమిన్ శిశ్నము గర్భణా ఈ ఇంజెక్షన్‌కు రైతుల నుంచి వసూలు చేసే రూ. 70లో ప్రభుత్వానికి చెల్లించే ప్రోత్సాహక రుసుం పేరుతో తిరిగి వారికే చెల్లించేందుకు 2018 నంబర్ 5న జీవో జారీ చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి మూడు నెలలు ఇచ్చారు. ఆ తర్వాత చెల్లించలేదు. అధికారంలోకి రాగానే గోపాల మిత్రలు విన్నవించిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని 2018 జనవరి 13న చిత్తూరు జిల్లాలో నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్రలో ప్రతిపక్ష నేత హెూదాలో జగన్ ఇచ్చిన హామీని ఇచ్చారు. ఐదేళ్లగా గోపాల మిత్రల చెల్లింపునకు ప్రోత్సాహక నగదు బకాయిలు అడిగితే ఉద్యోగాల తొలగిస్తామంటు ఉన్నతాధి కారులు భయ పెడుతున్నారని తమ బాధను వ్యక్తం చేశారు. ప్రతినెలా ఇవ్వాల్సిన గౌరవ వేతనం 6500 నాలుగు నెలలు పూర్తవుతున్నప్పటికీ నేటికీ జమ కాలేదు. కృత్రిమ గర్భధారణ ప్రోత్సాహక నగదు ఉమ్మడి జిల్లాలో సుమారు నాలుగు కోట్ల రూపాయలు జమ కావలసి ఉందని గోపాల మిత్రులు తెలియజేశారు.



రికార్డులో నమోదు చేస్తున్న గోపాలమిత్ర



ఇంజక్షన్ వేస్తున్న గోపాలమిత్ర

ఉద్యోగ భద్రత కల్పించాలి

పాడి పరిశ్రమ అభివద్ధిలో భాగంగా అతి ఎక్కువ కత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేయడంతో జిల్లా, మండల రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు తీసుకున్నాను. రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖకు గుర్తింపు వచ్చిందంటే రెండు దశాబ్దాలుగా గోపాల మిత్రులు చేస్తున్న సేవల ద్వారానే వచ్చింది. అటువంటి గోపాల మిత్రులకు కనీస ఉద్యోగ భద్రత లేకపోవడం శోచనీయం



కర్రి రామారావు
గోపాలమిత్ర, జాతీయ అవార్డు గ్రహీత

ప్రోత్సాహక బకాయిలు చెల్లించాలి

గోపాల మిత్రులకు ఐదు సంవత్సరాలుగా రావలసిన ప్రోత్సాహక నగదు బకాయిలను త్వరగా ఇవ్వాలి. తమని కాదంటూ రైతు భరోసా కేంద్రాల్లో పశు సహాయకులను ప్రభుత్వం నియమించి తమ పట్ల వివక్ష చూపుతుంది. 20 సంవత్సరాలుగా దీనిపై ఆధారపడి బతుకుతున్న గోపాల మిత్రులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. తమకు ప్రతి నెలా వేతనాలు సకాలం లో చెల్లించాలి.



ఆర్‌డిఎస్ అప్పారావు
జిల్లా యూనియన్ నాయకులు




పేరకు పోయిన చెత్తాచెదారం

చెత్తాచెదారంతో గ్రామముఖద్వారం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో ప్రధాన రహదారిని అనుకుని ఉన్న గొట్టువాడ గ్రామం అపారిశుధ్యానికి నిలయంగా మారింది. నర్సీపట్నం -పోలవరం రోడ్డును అనుకొని గ్రామ ముఖ ద్వారం డంపింగ్ యార్డుగా దర్శనమిస్తోంది. దీంతో, గ్రామస్తులు సహా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు రహదారి నుంచి రాకపోకలు సాగించే వారికి దుర్గంధం వెదజల్లడమే కాకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు గాలికి ఎగిరి రోడ్లపై పడుతూ ఉండటంతో అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రధాన రహదారిని అనుకుని ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా రమణ

ప్రజాశక్తి-మాకవరపాలెం: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా బొంతు రమణ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొంతు రమణ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బాద్యతను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బన్న పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని ఇస్తున్న శ్రీనివాస్

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో శనివారం వాలీబాల్ టోర్నమెంట్ ను నిర్వహించారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్లో ఆరు జట్లు పాల్గొనగా రన్నర్‌గా మంగబంద, విన్నర్ గా అలమగూడెం జట్లు గెలుపొందాయి. గెలుపొందిన జట్లకు వాలీబాల్ కిట్లతో పాటు, ట్రోఫీలను సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ చర్యన్ రాజు అందజేశారు.